

## సీపీఆర్ చేసి ప్రాణాన్ని కాపాడిన
# కోర్టు కానిస్టేబుల్

**కోర్టు ఆవరణలో గుండె నొప్పితో కుప్పకూలిన వ్యక్తి**

**సకాలంలో స్పందించిన కానిస్టేబుల్ భాస్కర్**

**అభినందించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**ప్రజానావ, సిరిసిల్ల :** కోర్టు ఫేషికి హాజరైన వ్యక్తి సిరిసిల్ల జిల్లా కోర్టులో కుప్పకూలి పడిపోగా అక్కడే ఉన్న కోనరావుపేట కోర్టు కానిస్టేబుల్ సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఉదంతం చోటు చేసుకుంది. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో ఇల్లంతకుంట మండలం కట్కూరు గ్రామానికి చెందిన వెంకటేశం కోర్టు కి హాజరు కాగా అకస్మాత్తుగా గుండె నొప్పితో కుప్పకకూలగా అక్కడే ఉన్న కొనరావుపేట పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ భాస్కర్ సకాలంలో స్పందించి సీపీఆర్ చేయడంతో బాధితుడు స్పృహలోకి రావడంతో పాటు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కానిస్టేబుల్స్ చాకచక్యంగా వ్యవహరించడంతో వెంకటేశం ప్రాణాలతో బయటపడ్డారు. సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ ను నెటిజన్లు అభినందిస్తున్నారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి తక్షణం సాయపడేలా పోలీసులకు ఉన్నతాధికారులు ఇప్పించిన సీపీఆర్ శిక్షణ ఓ నిండు ప్రాణం నిలబెట్టింది.

# నేటి నుంచి వార్డు సభలు

**మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా**



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 39 వార్డులలో గురువారం నుంచి 8వ తేదీ వరకు వార్డు సభలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎండి ఖదీర్ పాషా వార్డు సభల షెడ్యూల్ ను విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం సిరిసిల్ల పురపాలక సంఘం లో "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యచరణలో భాగంగా జూన్ 4, 6, 8,10 తేదీలలో నాలుగు రోజులు వార్డుల వారీగా షెడ్యూల్ ప్రకారం ఉదయం 8 గంటల నుండి వార్డు సభలు ఏర్పాటు చేసినట్టు కమిషనర్ వెల్లడించారు.

# పర్యావరణ పరిరక్షణకు బైక్ ర్యాలీ

**ప్రజానావ, గజ్వేల్:** ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ రేంజ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో కల్పకవనం అర్బన్ పార్క్‌లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జూన్ 1 నుంచి 12 వరకు చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు గౌరవ ఆర్‌డీఓ మేడం చేతుల మీదుగా అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. రెండో రోజు తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహించి, అటవీ శాఖ చేపడుతున్న పండ్ల మొక్కల పంపిణీ, గ్రీన్ ఫ్రిడ్జ్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం వాసవి క్లబ్ సభ్యులు, అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని ఆర్ఆర్ కాలనీలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో పాల్గొన్న వారు ప్లాస్టిక్ నివారణ, ఇంటింటా మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ, అడవి జంతువుల సంరక్షణ వంటి అంశాలపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పవన్ కుమార్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఇంటికొక మొక్క నాటాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని, అటవీ అగ్నిప్రమాదాల నివారణతో పాటు చైనా మాంజా వినియోగ నియంత్రణలో కూడా ప్రజలు తమ వంతు బాధ్యతగా సహకరించాలని పిలుపునిచ్చారు.





# మగ్గం గౌరవానికి శిలారూపం

**కలెక్టరేట్ జంక్షన్‌లో 'జోట' స్టాచ్యూ**

**నేతన్న జీవనశైలిని ఆవిష్కరించే త్రీడీ చిత్రాలు**

## త్వరలో ప్రారంభానికి ముస్తాబు

**హర్షం వ్యక్తం చేస్తున్న చేనేత కార్మికులు**

తెలంగాణలో చేనేత రంగానికి చిరునామాగా నిలిచిన సిరిసిల్ల పట్టణంలో నేతన్నల కష్టం, కళ మరియు ఆత్మగౌరవానికి ప్రతీకగా కలెక్టరేట్ జంక్షన్‌లో ప్రతిష్టాత్మకమైన "జోట" (నాడె) స్టాచ్యూను ఏర్పాటు చేశారు. అగ్గిపెట్టెలో ఇమిడే చీర, ఉంగరం నుంచి దూరే చీర వంటి అద్భుతమైన కళాఖండాలను సృష్టించి ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడించిన నేతన్నల జీవన సంస్కృతికి అద్దం పట్టేలా ఈ జంక్షన్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు. తమ వృత్తికి, శ్రమకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ జోట స్టాచ్యూ జంక్షన్‌ను ఏర్పాటు చేయడం పట్ల స్థానిక సిరిసిల్ల నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వస్త్రాన్ని సృష్టించే మగ్గంలో జోట (నాడె) కదిలితేనే నేతన్నల బతుకు చక్రం తిరుగుతుందని, అందుకే ఈ విగ్రహం కేవలం ఒక శిల్పం మాత్రమే కాకుండా ఒక వృత్తి గౌరవానికి లభించిన గుర్తింపు అని వారు కొనియాడుతున్నారు.





**ప్రజానావ, సిరిసిల్ల :** మగ్గం గిరగిరలు రంగుల దారాల సందడి.. కష్టానికి కళను జోడించి ప్రపంచానికి వస్త్రాలను అందించే చేతులు... ఇదే సిరిసిల్ల. తెలంగాణలో చేనేతకు చిరునామాగా నిలిచిన సిరిసిల్ల పేరు వినగానే గుర్తొచ్చేది నేతన్నల జీవనగాథే. అగ్గిపెట్టెలో ఇమిడే చీర, ఉంగరం, దబ్బునంలోంచి దూరే చీర ఇలా ఎన్నో అద్భుతమైన కళాఖండాలను సృష్టించి సిరిసిల్ల ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత నేతన్నలదే. అలాంటి నేతన్నల కష్టం, కళ, ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇప్పుడు సిరిసిల్లలో మరో మణిహారం జతకాబోతోంది. కలెక్టరేట్ జంక్షన్‌లో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న "జోట"(నాడె) స్టాచ్యూ కేవలం ఒక శిల్పం కాదు... సిరిసిల్ల జీవన స్రవంతికి ప్రతిబింబం. తమ కష్టానికి ఇలా శిలా రూపం ఇచ్చి ప్రభుత్వం "జోట" స్టాచ్యూ జంక్షన్ ఏర్పాటు చేయడం పట్ల సిరిసిల్ల నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా పట్టణాల్లో జంక్షన్‌లు ట్రాఫిక్ నియంత్రణ కేంద్రాలుగానే కనిపిస్తాయి. కానీ కాలక్రమేణా అవి నగర సంస్కృతిని చెప్పే చిహ్నాలుగా మారుతున్నాయి. ఇప్పుడు సిరిసిల్లలోని కలెక్టరేట్ జంక్షన్ కూడా నేతన్న జీవన తత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే కేంద్రంగా మారబోతోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన "జోట" స్టాచ్యూ వెనుక ఉన్న ఆలోచన కూడా అదే. సిరిసిల్ల అంటే చేనేత... చేనేత అంటే నేతన్న... ఆ నేతన్న జీవితంలో జోటకు ఉన్న అనుబంధం ఎంతో ప్రత్యేకం. వస్త్రాన్ని సృష్టించే మగ్గంలో జోట (నాడె) కదిలితేనే నేతన్నల బతుకు చక్రం తిరుగుతుంది. అందుకే ఈ విగ్రహం కేవలం కళాఖండం కాదు... ఒక వృత్తి గౌరవానికి ఇచ్చే గుర్తింపు.

### "నేతన్న చెమట చుక్కలకు కళారూపం"

సిరిసిల్ల చేనేత పరిశ్రమ ఎన్నో ఒడిదుడుకులు చూసింది. ఒకప్పుడు ఆర్థిక కష్టాలు, అప్పుల భారంతో ఎన్నో నేతన్న కుటుంబాలు సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి.



అయినా మగ్గం ఆగలేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా పవర్‌లూమ్స్, ఆధునిక టెక్నాలజీ వచ్చినా చేనేతపై ఉన్న అనుబంధం తగ్గలేదు. ఇప్పుడు అదే జీవనగాథను శిల్పరూపంలో చూపించే ప్రయత్నమే ఈ జోట స్టాచ్యూ. జంక్షన్ చుట్టూ రూపొందిస్తున్న త్రీడీ చిత్రాలు కూడా కేవలం అలంకరణ కోసం కాదు. నేతన్న ఉదయం నుంచి రాత్రి వరకు పడే కష్టం, దారంతో జీవితాన్ని నేసే కళ, కుటుంబాల ఆర్థిక బంధం ఇవన్నీ పాఠంలా చెప్పేలా రూపకల్పన చేయబడింది. దూది నుండి నూలు తీయడం, నూలుకు రంగులద్దడం, మగ్గంపై వస్త్రం తయారీ, కండెలు చుట్టే యంత్రం ఇలా వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా ఉన్న కొన్ని ప్రక్రియలను చిత్ర రూపంలో రూపొందించారు.

### "ఇది కేవలం స్టాచ్యూ కాదు... సిరిసిల్ల గర్వం"

ప్రతి పట్టణానికి ఒక గుర్తింపు ఉంటుంది. సిరిసిల్లకు ఆ గుర్తింపు చేనేత. అయితే కొత్త తరం పిల్లలకు నేతన్న కష్టం, చేనేత గొప్పతనం ప్రత్యక్షంగా కనిపించే అవకాశాలు తగ్గుతున్నాయి. అలాంటి సమయంలో ఈ జోట(నాడె) స్టాచ్యూ ఒక చరిత్ర పాఠంలా నిలవనుంది. రేపటి తరం "ఇది ఏమిటి?" అని అడిగితే... "ఇది మన నేతన్న గౌరవం" అని చెప్పేలా ఈ నిర్మాణం ఉంటుంది. సెల్ఫీలకు మాత్రమే పరిమితం కాకుండా, ఒక వృత్తి వెనుక ఉన్న కష్టం, కళ, జీవన తత్వాన్ని గుర్తు చేసే ప్రజా చిహ్నంగా మారే అవకాశం ఉంది. చేనేత ఉత్పత్తులతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న సిరిసిల్ల, ఇప్పుడు ఈ జోట స్టాచ్యూతో పర్యాటక కోణంలోనూ ప్రత్యేకత సాధించే అవకాశం కనిపిస్తోంది. స్థానిక సంస్కృతిని ప్రతిబింబించే ప్రదేశాలపై యువత, పర్యాటకులు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఇది సెల్ఫీ స్పాట్‌గానే కాకుండా, చేనేత వారసత్వాన్ని చాటే ల్యాండ్‌మార్క్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. మగ్గం చప్పుడు వినిపించే నేలపై... నేతన్న కష్టాన్ని శిలగా మలిచే ఈ "జోట" స్టాచ్యూ జంక్షన్ ప్రారంభమైతే, అది కేవలం జంక్షన్ అందం కాదు... సిరిసిల్ల ఆత్మకు నిలువెత్తు ప్రతిరూపంగా నిలుస్తుంది.





